# రఘురామిడు లేడాయె

- డా. ఎన్. గోపి

డా. కిడాంబి రఘునాథ్ హఠాన్మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక పచ్చని చెట్టు ఉన్న పళంగా అగ్ని ప్రమాదానికి గురైనట్లుగా తోచింది. చిరకాలంగా అమెరికాలో స్థిరపడి, ఇండియా అమెరికాల మధ్య సాంస్కృతిక రాయబారిగా వ్యవహరించి, పత్రికానిర్వాహకుడిగా తెలుగు వెలుగై ప్రకాశించిన కిడాంబి మనకిక లేరు అని తెలిసిన రోజు రాత్రంతా నిద్రపట్టలేదు.

నారాయణరెడ్డి గారింట్లో కిడాంబితో మొదటి పరిచయం. తర్వాత నేను తెలుగు యూనివర్సిటీ వి.సిగా ఉన్నప్పుడు అంతర్జాతీయ తెలుగు సంస్థ సలహా సంఘ సభ్యుల్లో ఆయన ఉన్నారు. ఒకటి రెండు సమావేశాలకు కూడా హాజరయ్యారు. తర్వాత నేను రాసిన "Home for the aged" అన్న కవితను "తెలుగు జ్యోతి" లో ప్రచురించారు.

ఆయనతో అన్నిటి కన్న ముఖ్యమైన సన్నివేశం; న్యూయార్క్‌లో "వరల్డ్ ట్రేడ్ సెంటర్" పై దాడి జరిగినప్పుడు నేను కిడాంబి ఇంట్లోనే అతిథిగా ఉన్నాను. రెండు మూడు రోజుల్లో రఘునాథ్‌గారు వ్యవహరించిన తీరు ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక.

న్యూయార్క్‌లో నేను దిగగానే డా. కిడాంబి గేటు దగ్గర చిరునవ్వుతో ఆలింగనం చేసుకున్నారు. న్యూజెర్సీ రాష్ట్రంలో నువర్క్ అనేది ఓ పెద్ద ఊరు. అక్కడి నుంచి జననీకృష్ణ అని ఓ డాక్టర్ గారింట్లో ఏర్పాటు చేసిన తెలుగు సమావేశానికి వెళ్ళాం. కూడా డా. శారదా పూర్ణశొంఠి ఉన్నారు. జననీకృష్ణ అక్కడి తెలుగు కళా సమితి (The Telugu Fine Arts Society) కి అధ్యక్షురాలు. - సమావేశానికి రాజారావు బండారు, భావరాజుమూర్తి, నిర్మల పరంజ్యోతి, మాధవి వేమూరి, అనంత సుధాకర్ ఉప్పల, వేణుగోపాలకృష్ణ ఓరుగంటి, మల్లాది బాలకృష్ణమూర్తి తదితరులు విచ్చేశారు. ఇంకా కలశపూడి శ్రీనివాసరావు, పరంజ్యోతి కొచ్చెర్లకోట, జనార్దన్ అల్లాడ తదితరులు హాజరయ్యారు. ఈ పూసలన్నింటిని కలిపిన దారం శ్రీ కిడాంబి.

1978 లో న్యూయార్క్ నుండి తెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థద్వారా "తెలుగు వెలుగు" పత్రిక వెలువడేది. ఐదేళ్ళదాకా నడిచింది. 1984 నుంచి "తెలుగు జ్యోతి" పత్రిక ప్రారంభమైంది. రెండు పత్రికలకూ కిడాంబివారే సంపాదకులు. అననుకూల వాతావరణంలో ఒక పత్రికను ఇంత సుదీర్ఘ కాలం నడపడం కిడాంబి ప్రతిభకు తార్కాణం. ఇటువంటి వాటికి అతి తక్కువ సమయం దొరికే అమెరికాలాంటి దేశంలో నెలకు దాదాపు 40 గంటలు వెచ్చించవలసి ఉంటుందని కిడాంబివారు అనేవారు. ఈ విషయంలో వారి సతీమణి శ్రీమతి ప్రభ వారికి చేదోడుగా ఉండేది. కిడాంబి ఇంట్లో ఉన్న రోజుల్లో ఓరోజు న్యూయార్క్‌లో మేమో టాక్సీ ఎక్కాం. టాక్సీవాడు "ఇండియన్సా" అంటూ సంభాషణకు దిగాడు. "అమెరికా వాళ్ళకు గర్వం ఎక్కువ" అన్నాడు. దాన్ని మేమంత సీరియస్‌గా తీసుకోలేదుగాని కిడాంబి చూడండి వాడెలా అన్నాడో వెధవ అని చాలాసార్లు గుర్తుచేసారు.

కిడాంబి గొప్ప మానవతామూర్తి. కష్టమొస్తే స్వపరభేదంలేదు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ సంక్షోభం రోజుల్లో ఓ తెలిసినవారి పిల్లవాడి భార్య ట్రేడ్ సెంటర్ భవనంలోనే పనిచేస్తుంది. విప్రోకంపెని అనుకుంటాను. ఆమె పొద్దున్నే ఉద్యోగానికి వెళ్ళింది. ఏమయ్యిందో తెలియదు. కిడాంబీ నేను హుటాహుటిన 15 ని. ల దూరంలో ఉన్న అతనింటికి వెళ్ళాం. దంపతులిద్దరూ వారం రోజుల క్రితమే ఇండియా నుంచి వచ్చారు. అతను ఆమె డిపెండెంట్ వీసాపై వచ్చి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. భార్యా భర్త లిద్దరు హైదరాబాద్ వారే, అతని పేరు కుమార్ చూడగానే నన్ను గుర్తుపట్టాడు. శివానందస్వామి శిష్యుల కుటుంబానికి చెందినవాడు. ఆ మధ్య సికిందరబాద్ టివోలీ గార్డెన్‌లో జరిగిన వారం రోజుల సంగీత సాంస్కృతికోత్సవాల్లో నా ఉపన్యాసం విన్నాడట! అక్కడి వాతావరణ దయనీయంగా ఉంది. నిస్తేజమైన మొహాలతో ఎక్కడెక్కడికో ఫోన్లు చేస్తున్నారు. అతడూ, అతని తోడుగా వచ్చిన మిత్రుడూ, కుమార్‌కి ఒక కొడుకు చిన్నవాడు, వాడికా విషాదం తెలియదు. కుమార్ భార్య దీపిక ఆఫీసు 97వ అంతస్తులో ఉంది. విమానం 86,87వ అంతస్తుల్ని ఢీకొట్టడం మేం చూశాం కుమార్ చూడలేదు. ఈ పరిస్థితికి కిడాంబి విలవిల్లాడి పోయాడు. బంధువు వచ్చేదాకా వుందాం. ఈలోపల కుమార్ కొడుకుని ప్రభగారికి అప్పజెప్పాం. మరో రెండు రోజులదాకా కిడాంబికి ఇదే మెరమెర. అప్పటి పరిస్థితుల్లో కిడాంబి న్యూయార్క్ నుంచి మమ్మల్ని షికాగో పంపడానికి చేసిన ప్రయత్నాలను కూడా నేను మరిచిపోలేను.

రోజు పొద్దుటి నుంచి ఒకటే వర్షం! అమెరికా ఈశాన్య ప్రాంతమంతా పడుతుంది. ఈశాన్యమంటే న్యూజెర్సీ, న్యూయార్క్, పెన్సిల్వేనియాలు ఉన్న ప్రాంతం. ఫ్లోరిడాలో అల్పపీడనం వల్ల ఈ వర్షం. ఫ్లోరిడా అంటే అట్లాంటిక్ సముద్ర ప్రదేశం. నాటి శోకవాతావరణానికి వర్షం సరిగ్గా సరిపోయింది. తుఫానుకు గాబ్రియల్ అని పేరు పెట్టారు. వాళ్ళు ఒక్కో తుఫానుకు ఒక్కోపేరు పెడతారు.

కిడాంబి అస్తమయం అనే అల్పపీడనం వల్ల ఏర్పడిన తుఫానుకు పేరులేదు. నేను ఇప్పుడా తుఫానులో తడుస్తున్నాను.***